ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-11-2026 సమయం: రాత్రి 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

❖ అక్వాన్ తుపాను నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశించారు.

❖ తుపాను సమయంలో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జాతీయ, రాష్ట్ర విపత్తు స్పందన దళాలతో పాటు స్థానిక అగ్నిమాపక బృందాలను సిద్ధంగా ఉంచినట్లు మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.

❖ శ్రీకాకుళం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు.

❖ బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర తుపాను `అక్వాన్` ఈనెల 20వ తేదీ మధ్యాహ్నానికి తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలియజేసింది.

==========

అక్వాన్ తుపాను నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశించారు. నెల్లూరు నుంచి విశాఖపట్నం వరకు తీర ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తుపాను ప్రభావంతో గంటకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున, విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ మేరకు మూడు డిస్కంల ఉన్నతాధికారులతో మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. తుపాను తీవ్రత దృష్ట్యా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. అదనపు సిబ్బంది అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ విద్యుత్ శాఖ మంత్రికి ఇప్పటికే లేఖ రాసినట్లు వెల్లడించారు.

==========

బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తీవ్ర తుపాను నేపథ్యంలో రానున్న 48 గంటల పాటు రాష్ట్రంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో ఉండాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖల మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. తుపాను ప్రభావం, ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలపై హోం మంత్రి అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. తుపాను కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. తుపాను అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు 13 జాతీయ విపత్తు స్పందన దళాలు, 11 రాష్ట్ర విపత్తు స్పందన దళాలతో పాటు స్థానిక అగ్నిమాపక బృందాలను సిద్ధంగా ఉంచినట్లు మంత్రి తెలియజేశారు. అవసరమైన ప్రాంతాల్లో సహాయక బృందాలను తక్షణమే రంగంలోకి దింపేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా, మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన నియంత్రణ కేంద్రాలు నిరంతరం పని చేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, సహాయం కోరే సమాచారంపై వెంటనే స్పందించాలని ఆదేశించారు. తీర ప్రాంత ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా ఇళ్ల నుంచి బయటకు రావద్దని హోంమంత్రి సూచించారు.

==========

శ్రీకాకుళం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసిందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. కలెక్టరేట్‌లో ఆయన ఈరోజు విలేకరులతో మాట్లాడుతూ... రేపు మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ), ఎల్లుండి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ (జెడ్పీ చైర్మన్) పరోక్ష ఎన్నికలు జరగనున్నాయని తెలియజేశారు. ఈ ఎన్నికల కోసం మండల పరిషత్ హాళ్లలో ప్రిసైడింగ్ అధికారులను నియమించామని, గెలుపొందిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. మరోవైపు, మూడు విడతల్లో జరగనున్న గ్రామ పంచాయతీ, పురపాలక ఎన్నికలకు కూడా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ వివరించారు. మొదటి విడతలో భాగంగా ఈనెల 26న ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల పరిధిలోని పంచాయతీలతో పాటు శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్, ఆమదాలవలస మున్సిపాలిటీలకు పోలింగ్ జరుగుతుందని ఆయన తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========

ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (IFFI) 57వ చలన చిత్రోత్సవాలకు గోవా నగరం సిద్ధమైంది. ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు ఈ ఫిల్మ్ ఫెస్టివల్ జరగనుంది. ఈ సందర్భంగా `స్టోరీస్ వితౌట్ బోర్డర్` థీమ్ కింద వివిధ దేశాలు, భాషలకు చెందిన పలు చిత్రాలను అక్కడ ప్రదర్శితం కానున్నాయి. ఇందులో భాగంగా పలు తెలుగు సినిమాలు కూడా ప్రదర్శనకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఆ జాబితాలో చిరంజీవి నటించిన `మన శంకర్ వర ప్రసాద్ గారు`తో పాటు దిగ్గజ దర్శకులు సింగీతం శ్రీనివాసరావ్ తెరకెక్కించిన సింగ్ గీతం, చెన్నై లవ్ స్టోరీ, భక్త కన్నప్ప చిత్రాలు కూడా చోటు దక్కించుకున్నాయి. ఇక ఉత్తమ వెబ్ సిరీస్ (ఓటీటీ) విభాగంలో తెలుగు వెబ్ సిరీస్ `మయసభ` కూడా ఈ ఇఫి ఎడిషన్ కు ఎంపికయ్యింది.

విరామం

==========

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 5వ రోజైన ఈరోజు ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాల ప్రాముఖ్యతపై నిర్వహించిన పోటీల్లో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్‌పై కూడా క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్ బాబు అధ్యక్షత వహించారు. న్యాయనిర్ణేతలుగా పలువురు కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, గ్రంథాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

==========

జన గణనలో భాగంగా క్షేత్ర స్థాయి శిక్షకులకు విశాఖలో నిర్వహించిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమం నేటితో ముగిసింది. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు సౌత్ జోన్ జీవీఎంసీ సమావేశ మందిరంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ ఆర్డీఓ ఎస్.డి. అనిత మాట్లాడుతూ... శిక్షణలో పాల్గొన్న శిక్షకులు జనాభా గణనకు సంబంధించిన అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని, క్షేత్ర స్థాయిలో సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు సమగ్ర శిక్షణ అందించాలని సూచించారు. రానున్న జన గణనను అవాంతరాల్లేకుండా.. సమర్థవంతంగా నిర్వహించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పని చేయాలని కోరారు. శిక్షణలో పాల్గొన్న క్షేత్ర స్థాయి శిక్షకులు, మండల స్థాయిలో సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్లకు శిక్షణ అందించనున్నారు.

==========

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా పోలవరం జిల్లాలో నిర్వహించనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించు కోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని మొత్తం 12 మండలాల్లో రెండు విడతలుగా గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు రాజవొమ్మంగి, అడ్డతీగల, గంగవరం, దేవీపట్నం, రంపచోడవరం మొత్తం ఐదు మండలాల్లో నిర్వహించనున్నట్లు, ఈ మండలాల్లో ఈనెల 26వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని కలెక్టర్ తెలియజేస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========

బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర తుపాను `అక్వాన్ ఈనెల 20వ తేదీ మధ్యాహ్నానికి తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలియజేసింది. పశ్చిమ మధ్య, దానికి ఆనుకుని ఉన్న దక్షిణ బంగాళాఖాతంలోని మధ్య ప్రాంతాల్లో కొనసాగుతున్న తీవ్ర తుపాను `అక్వాన్` గత 6 గంటల్లో గంటకు 9 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్య దిశగా కదులుతోందని వెల్లడించింది. తుపాను ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని నర్సాపూర్‌కు ఆగ్నేయంగా సుమారు 500 కిలోమీటర్లు, కళింగపట్నానికి దక్షిణ ఆగ్నేయంగా 540 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు దక్షిణంగా 630 కిలోమీటర్లు, పూరీకి దక్షిణంగా 690 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లోని నర్సాపూర్ నుంచి ఒడిశాలోని పూరీ మధ్య ప్రాంతంలో ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరాల మీదుగా తీరందాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇది తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండగా, అప్పుడప్పుడు గాలుల వేగం గంటకు 110 కిలోమీటర్ల వరకు పెరగవచ్చని పేర్కొంది.

==========

బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టాలని, ఇందుకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆన్‌లైన్ ద్వారా ఐసీడీఎస్, సంబంధిత శాఖల అధికారులతో ఆయన ఈరోజు త్రైమాసిక సమావేశం నిర్వహించారు. శిశువులు, బాలికలు, మహిళల సంక్షేమంపై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖాపరంగా తీసుకున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కఠినమైన శిక్షలు, చట్టపరమైన చర్యలతోనే బాల్య వివాహాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడుతుందని స్పష్టం చేశారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులకు, ముఖ్యంగా బాలికలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

==========
==========